# వాయిస్ టుడే

www.Voicetodaynews.com
https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

బుధవారం, ఫిబ్రవరి 7, 2024

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD


## 60 గ్రూప్-1 పోస్టులకు గ్రీన్‌సిగ్నల్

### టీఎస్‌పీఎస్సీ ద్వారా భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ అనుమతి




**హైదరాబాద్:** గ్రూప్-1 కేటగిరీలో మరో 60 పోస్టులు భర్తీ చేసేందుకు ఆర్థికశాఖ గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఆర్థిక, హెూం, కార్మిక, పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖల పరిధిలో ఈ పోస్టులను తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ద్వారా భర్తీ చేసేందుకు అనుమతినిస్తూ ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు మంగళవారం జీఓ నం.16 జారీ చేశారు. నోటిఫికేషన్ జారీ చేసి డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ పద్ధతిలో ఈ పోస్టులు భర్తీ చేయాల్సి ఉంటుందని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# టచ్ చేసి చూడు

## సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సవాల్

- బీఆర్ఎస్‌ను, నన్ను కొత్త సీఎం ఇష్టం వచ్చినట్లు తిడుతున్నారు
- నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు.. నీ కంటే హేమాహేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకుంది
- పదేళ్లు కాపాడుకున్న రాష్ట్రాన్ని పరాయివాళ్ల పాలు చేస్తున్నారు
- ప్రభుత్వాన్నైనా రద్దు చేస్తా కానీ ప్రాజెక్టులను అప్పగించనని నేను కేంద్రానికి చెప్పా
- కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకుంది
- సర్కారు వైఖరితో రాష్ట్రం మళ్లీ కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం
- తెలంగాణ విషయంలో కేసీఆర్ వెనక్కి పోడు..
- ఉడుత బెదిరింపులకు భయపడడు
- సాగు, తాగునీటి హక్కుల రక్షణ లక్ష్యంగా 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ
- తుంటి ఎముకకు శస్త్రచికిత్స తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌కు కేసీఆర్



**హైదరాబాద్:** 'రాష్ట్రాన్ని పదేళ్లు పదిలంగా కాపాడుకున్నాం. దాన్ని పరాయి వాళ్ల పాలు చేస్తున్నారు. తెలంగాణ విషయంలో కేసీఆర్ ఏనాడూ వెనక్కి పోడు. ఉడుత బెదిరింపులకు భయపడడు. తెలంగాణ ప్రయోజనాల కోసం ఏం చేయాలో నాకు బాగా తెలుసు. నదీ జలాల విషయంలో రాష్ట్రం హక్కులను కాపాడుకునేందుకు ఎంతవరకైనా పోరాడతాం. కొత్త సీఎం బీఆర్ఎస్ పార్టీని, వ్యక్తిగతంగా నన్ను ఇష్టం వచ్చినట్లు తిడు తున్నారు. నన్ను, నా పార్టీని టచ్ చేయడం నీతో కాదు. నీ కంటే హేమా హేమీలనే ఎదుర్కొన్న చరిత్ర మాకుంది..' అని బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కె.చంద్రశేఖర్‌రావు స్పష్టం చేశారు. కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఆయన తీవ్రంగాఖండించారు. ప్రాజెక్టుల విషయంలో ప్రజలకు అవగాహన కల్పించడం, తెలంగాణ సాగునీటి హక్కుల పరిరక్షణ లక్ష్యంగా ఈ నెల 13న నల్లగొండలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇటీవల - 2వ పేజీలో

### నల్లగొండ సభను విజయవంతం చేయాలి

తెలంగాణ భవన్‌లో సమావేశానంతరం నందినగర్ నివాసంలో కేసీఆర్ మరోసారి నాయకులతో సమావేశమయ్యారు. ఈ నెల 13న నల్లగొండలో బహిరంగసభ నిర్వహణపై ఉమ్మడి ఖమ్మం , మహబూబ్‌నగర్, హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాల ముఖ్య నేతలు సమన్వయ కర్తలతో చర్చించారు. ప్రాజెక్టుల అప్పగింతతో ఎదురయ్యే దుష్పరిణామాలు ంతెలంగాణ సమాజానికి తెలిసేలా ఈ సభను విజయవంతం చేయాలని సూచించారు.



## 'స్వగృహ'కు స్వస్తి

### అసంపూర్తి ఇళ్లు, భూములు అమ్మాలని నిర్ణయం

**ఉన్నవి ఉన్నట్టు బేరం పెట్టేందుకు ధరల ఖరారుకు కమిటీ..**

**రూ.3,500 కోట్ల వరకు సమకూరే అవకాశం**

**గంపగుత్తగా అమ్మేయాలని యోచన**

**హైదరాబాద్:** రాజీవ్ స్వగృహకు స్వస్తి చెప్పే యోచనలో ప్రభుత్వం ఉన్నట్టు తెలిసింది. కార్పొరేషన్ ఆధ్వర్యంలో వివిధ దశల్లో ఉన్న గృహ నిర్మాణ ప్రాజెక్టులు, భూములను అమ్మేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వీటిని అమ్మితే రూ.3500 కోట్లు సమకూర్చుకునే అవకాశముందని ప్రభుత్వం తేల్చినట్టు తెలిసింది. కొన్ని ఖాళీ భూములు వివాదంలో ఉండగా, మిగ తావి అమ్మ కానికి సిద్ధంగా ఉన్నాయి. బండ్లగూడ, పోచారం ప్రాజెక్టులు సహా మరికొన్ని చోట్ల ఉన్న అసంపూర్తి ప్రాజెక్టులను ఒక్కొక్కటిగా వ్యక్తులకుగానీ, గంపగుత్తగా సంస్థలకు గానీ అమ్మేయనున్నారు. వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నందున ప్రస్తుతం ఆ ఇళ్లకు, ఖాళీగా ఉన్న భూములకు ప్రస్తుత మార్కెట్ ప్రకారం ఏ ధర నిర్ణయించాలో తేల్చేందుకు ఓ కమిటీ ఏర్పాటు చేశారు. ఆ కమిటీ నివేదిక తర్వాత విక్రయ ప్రక్రియ ప్రారంభ మవుతుంది.

**అప్పుడే అమ్మిఉంటే..:** బండ్లగూడ, పోచారంలలో 6 వేలకుపైగా ఇళ్లను ఫ్లాట్ల రూపంలో గతంలో రాజీవ్ స్వగృహ కార్పొరేషన్ విక్రయించింది. పూర్తిస్థాయిలో సిద్ధమైన ఇళ్లు అప్పట్లో హాట్‌కేకులుగా అమ్ముడుపోయాయి. కానీ, నాటి ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి మరణం తర్వాత ఆ కార్పొరేషన్ పూర్తిగా గతి తప్పింది. రాజకీయ నేతలు, కొందరు ఉన్నతాధికారులు కుమ్మక్కయి అక్రమాలకు పాల్పడి నిధులు దారి మళ్లించారు. ఫలితంగా చేతిలో డబ్బు లేక మిగతా ఇళ్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేయలేకపోయారు. ఈ నెపాన్ని నాటి స్వగృహ కార్పొరేషన్ అధికారులపై నెట్టేసి ఉన్నతాధికారులు, నేతలు చేతులు దులుపుకున్నారు. తర్వాతి ప్రభుత్వాలు ఆ ఇళ్లను పట్టించుకోలేదు. అన్నింటిని సిద్ధం చేసి ఉంటే - 2వ పేజీలో

## 18న అభ్యర్థుల ప్రకటన?

### ఈ నెల 20 నుంచి ఎంపీ స్థానాల పరిధిలో రథయాత్రలకు బీజేపీ నిర్ణయం

**ఎన్నికల కార్యాచరణ, అభ్యర్థుల ఎంపికపై ఆరెస్సెస్ నేతలతో జాతీయ ముఖ్యనేతల భేటీ**

**గావ్ చలో, ఘర్ చలో కార్యక్రమం ద్వారా ఇంటింటి ఎన్నికల ప్రచారం ప్రారంభం**

**హైదరాబాద్:** రాష్ట్రంలో మిగతా రాజకీయ పార్టీల కంటే ముందే అభ్యర్థులను ప్రకటించడం ద్వారా లోక్‌సభ ఎన్నికల బరిలోకి దిగాలని బీజేపీ నాయకత్వం యోచి స్తోంది. లోక్‌సభ ఎన్నికల కసరత్తు పూర్తిచేసి ఈ నెల 18న అభ్యర్థులను ప్రకటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నెల 16, 17, 18 తేదీల్లో ఢిల్లీలో బీజేపీ జాతీయ కౌన్సిల్ సమావేశాలప్పుడు పార్టీ పార్లమెంటరీ బోర్డు భేటీ కానున్నట్లు పార్టీ వర్గాల సమాచారం. ఈ సందర్భంగానే లోక్‌సభ అభ్యర్థులను ఖరారు చేసే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల ఎంపికలో జరిగిన ఆలస్యం లోక్‌సభ ఎన్నికలకు జరగకుండా అభ్యర్థులను ముందే ప్రకటిస్తామని బీజేపీ అగ్రనేత, కేంద్ర హెూంమంత్రి అమిత్ షా గతంలో హామీ ఇచ్చారు. ఇందుకు తగ్గట్లుగానే త్వర లో అభ్యర్థులను ఖరారు చేస్తామని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఇటీవలే ప్రకటించారు. ఈ నేపథ్యంలో వివిధ సర్వేలు, ఇతర అంశాల ఆధారంగా అభ్యర్థుల ఎంపికకు కసరత్తు ఊపందుకున్నట్లు తెలుస్తోంది.

**షెడ్యూల్ వెలువడేలోగా యాత్రలు..:** ఈ నెల 20 నుంచి 17 ఎంపీ సీట్ల పరిధిలో రథ (బస్సు) యాత్రలకు జాతీయ నాయకత్వం నిర్ణయించింది. ఈ యాత్రలను మొదట ఈ నెల 10 నుంచి మొదలుపెట్టాలనుకున్నా అభ్యర్థులు ఖరారయ్యాక చేపడితే మరింత ప్రయోజనం ఉంటుందనే ఉద్దేశంతో ఈ నెల 20 నుంచి యాత్రలను నిర్వహించాలని నిర్ణయించినట్లు సమాచారం. ఎంపీ సీట్లను 5 క్లస్టర్లుగా (మూడు, నాలుగేసి సీట్లు ఒక్కో క్లస్టర్ చొప్పున) బీజేపీ జాతీయ నాయకత్వం విభజించింది. ఎన్నికల షెడ్యూల్ వెలువడేలోగా ఈ యాత్రలను పూర్తిచేయడం ద్వారా మిగతా పార్టీల కంటే ముందే తొలివిడత ప్రచారాన్ని పూర్తిచేసినట్లు అవుతుందని భావిస్తోంది. రోజుకు రెండేసి అసెంబ్లీ నియోజకవర్గాల చొప్పున నెలాఖరుకల్లా ఆయా లోక్‌సభ క్లస్టర్లలోని అసెంబ్లీ సెగ్మెంట్లను కవర్ చేసే యోచనలో పార్టీ ఉంది.

## బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ గాలం!

**టచ్‌లోకి మరో ముగ్గురు ఎంపీలు.. పలువురు ఎమ్మెల్యేలు**

**ప్రతిపక్షాన్ని బలహీనపర్చడంతోపాటు రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థి గెలుపే లక్ష్యంగా ప్రణాళిక**

**పదవులు, పనులు, వ్యాపార అవసరాల ప్రాతిపదికన ప్రలోభాలు?**

**పార్టీలో చేరిన ఎంపీ వెంకటేశ్ నేతకు మళ్లీ పెద్దపల్లి టికెట్ హామీ!**

**హైదరాబాద్:** ప్రతిపక్ష బీఆర్ఎస్‌కు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, ఎంపీలకు అధికార కాంగ్రెస్ పార్టీ గాలం వేస్తోంది. పార్లమెంటు ఎన్నికలకు ముందే బీఆర్ఎస్‌ను బలహీనపర్చడంతోపాటు త్వరలో జరగనున్న రాజ్యసభ ఎన్నికల్లో మూడో అభ్యర్థిని కూడా బరిలోకి దింపి విజయం సాధించడమే లక్ష్యంగా ఆపరేషన్ ఆకర్ష్ సాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగా దక్షిణ తెలంగాణకు చెందిన ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు, హైదరాబాద్ పరిసరాల్లోని పలువురు ఎమ్మెల్యేలతో కాంగ్రెస్ నేతలు ఇప్పటికే మంతనాలు ప్రారంభించారని... వారిలో 7–8 మంది ఎమ్మెల్యేల విషయంలో స్పష్టత వచ్చిందని తెలుస్తోంది. హైదరాబాద్‌కు చెందిన ముగ్గురు, దక్షిణ తెలంగాణకు చెందిన మరో ఎమ్మెల్యేతో కూడా చర్చలు పురోగతిలో ఉన్నట్లు గాంధీభవన్ వర్గాల్లో చర్చ జరుగుతోంది. పదవులు, ప్రలోభాలు, వ్యాపార అవసరాల ప్రాతిపదికన బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులను కాంగ్రెస్ నేతలు ప్రలోభ పెడుతున్నట్లు తెలిసింది. లోక్‌సభ ఎన్నికల కంటే ముందే రాజ్యసభ ఎన్నికలు జరుగుతుండటం, ఈ ఎన్నికల్లో విప్ జారీ చేసే అధికారం పార్టీలకు లేకపోవడంతో ఆపరేషన్ ఆకర్ష్‌ను ఎట్టిపరిస్థితుల్లో విజయవంతం చేయడంపై టీపీసీసీ పెద్దలు దృష్టి సారించినట్లు తెలుస్తోంది. తద్వారా తాము నిలబెట్టే మూడో అభ్యర్థి విజయం సాధిస్తే రాష్ట్రంలో బీఆర్ఎస్ పని అయిపోయిందనే భావనను ప్రజల్లో కలిగించొచ్చనేది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతానికి ఈ ఎమ్మెల్యేలంతా తమ మూడో అభ్యర్థికి ఓటు వేయడం వరకే పరిమితం కావాలని, లోక్‌సభ ఎన్నికల తర్వాత పార్టీలో చేర్చుకొనే అంశంపై నిర్ణయం తీసుకోవాలనే యోచనలో రాష్ట్ర కాంగ్రెస్ పెద్దలున్నారని సమాచారం. ఈ విషయాన్ని ఏఐసీసీకి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని, ఏఐసీసీ అనుమతి మేరకే మూడో అభ్యర్థిని రంగంలోకి దింపుతామని టీపీసీసీ సీనియర్ నేత ఒకరు 'సాక్షి'తో మాట్లాడుతూ వ్యాఖ్యానించారు.

**మరో ముగ్గురు.... నలుగురు:** పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేత కాంగ్రెస్‌లో చేరిన నేపథ్యంలో ఇంకెందరు బీఆర్ఎస్ ఎంపీలు, పార్టీ మారుతారోననే చర్చ రాజకీయ వర్గాల్లో జరుగుతోంది. ఏకంగా సిట్టింగ్ ఎంపీ పార్టీ మారడంతో ఈ చర్చ ఊపందుకుంది. గాంధీ భవన్ వర్గాల సమాచారం ప్రకారం మరో ముగ్గురు, నలుగురు బీఆర్ఎస్ ఎంపీలు కాంగ్రెస్‌తో టచ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఉమ్మడి పాలమూరు, రంగారెడ్డి, వరంగల్ జిల్లాలకు చెందిన ఆ ముగ్గురు ఎంపీల్లో ఒకరు ఎస్సీ రిజర్వుడ్, ఇద్దరు జనరల్ స్థానాల నుంచి గెలిచారని, వారు త్వరలోనే కాంగ్రెస్ తీర్థం పుచ్చుకుంటారని సమాచారం. అయితే వారి చేరిక విషయంలో టికెట్ల కేటాయింపు అంశం కొంత అడ్డంకిగా మారిందని, ఎంపీ టికెట్ ఇవ్వకపోయినా పార్టీలోకి వచ్చిన వారికి తగిన ప్రాధాన్యం ఇచ్చేలా చర్చలు జరుగుతున్నాయని అంటున్నారు. వరంగల్ జిల్లాకు చెందిన ఇంకో ఎంపీ విషయాన్ని కూడా కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. మొత్తంమీద లోక్‌సభ ఎన్నికల కంటే ముందే మరో ఇద్దరు లేదా ముగ్గురు బీఆర్ఎస్ ఎంపీలు తమ పార్టీలో చేరే అవకాశాలున్నాయని గాంధీ భవన్ వర్గాలు చెబుతున్నాయి.

### వెంకటేశ్ నేతకు తిరిగి ఎంపీ సీటు ఇవ్వొచ్చనే చర్చ

పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకు అదే స్థానం నుంచి కాంగ్రెస్ టికెట్ ఇవ్వొచ్చనే చర్చ జరుగుతోంది. ఆయన్ను పార్టీలో చేర్చుకొనేందుకు సీఎం రేవంత్ సైలంట్ ఆపరేషన్ నడిపించారని, అనేక సమీకరణాల నేపథ్యంలో వెంకటేశ్ నేత చేరిక అంశం కార్యరూపం దాల్చిందని తెలుస్తోంది. వాస్తవానికి పెద్దపల్లి ఎంపీ టికెట్‌ను చెన్నూరు ఎమ్మెల్యే గడ్డం వివేక్ కుమారుడు వంశీకి ఇవ్వాలనే ప్రతిపాదన ఉంది. అయితే ఎంపీ టికెట్ వంశీకి ఇవ్వలేకపోతే రాష్ట్ర కేబినెట్‌లో వివేక్‌కు స్థానం కల్పిస్తారని, వెంకటేశ్‌కు ఎంపీ టికెట్ ఇస్తారని గాంధీ భవన్ వర్గాలంటున్నాయి. మరోవైపు టికెట్ వంశీకి లేదా పార్టీలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న మరో నేతకు ఇస్తారని, పెద్దపల్లి పార్లమెంటు పరిధిలో ప్రభావిత స్థాయిలో ఓట్లున్న సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవడానికి వెంకటేశ్‌ను పార్టీలో చేర్చుకున్నారనే చర్చ కూడా జరుగుతోంది.

## మే 9 నుంచి టీఎస్‌ఈఏపీసెట్


**ఈ నెల 21న నోటిఫికేషన్ విడుదల..**

**ఏప్రిల్ 6 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**జూన్ 6 నుంచి పీజీ సెట్..**

**మార్చి 16 నుంచి దరఖాస్తుల స్వీకరణ**

**తేదీలు వెల్లడించిన సెట్స్ కన్వీనర్లు**



**హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ఉమ్మడి ప్రవేశ పరీక్ష (టీఎస్‌ఈఏపీసెట్)ను మే 9 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు సెట్ కన్వీనర్ డాక్టర్ దీన్‌కుమార్ వెల్లడించారు. దీనికి సంబంధించిన నోటిఫికేషన్ ఈ నెల 21వ తేదీన విడుదల చేస్తున్నామన్నారు. ఈసారి ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ సిలబస్‌ను వందశాతం అమలు చేస్తామని చెప్పారు. పరీక్ష ఆన్‌లైన్ విధానంలో ఉంటుందన్నారు. పోస్టు గ్రాడ్యుయేట్ కోర్సుల్లో ప్రవేశానికి ఉమ్మడి ప్రవేశపరీక్ష (టీఎస్‌పీజీ సెట్)ను జూన్ 6 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్టు పీజీ సెట్ కన్వీనర్ డాక్టర్ అరుణకుమారి తెలిపారు. రాష్ట్ర ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో మండలి చైర్మన్ ప్రొఫెసర్ లింబాద్రి నేతృత్వంలో మంగళవారం సెట్స్ తేదీలు వెల్లడించారు. మండలి వైస్ చైర్మన్ ప్రొఫెసర్ ఎస్‌కే మహ్మమూద్, కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్, జేఎన్‌టీయూహెచ్ వీసీ ప్రొఫెసర్ కట్టా నర్సింహారెడ్డి, ఉస్మానియా యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

| | |
|---|---|
| **ఈఏపీసెట్ సెట్ షెడ్యూల్ ఇలా...** | |
| 21.2.24 | సెట్ నోటిఫికేషన్ విడుదల |
| 26.2.24 | ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ |
| 6.4.24 | దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ |
| మే9 నుంచి 12 వరకు | ఈఏపీసెట్ పరీక్ష నిర్వహణ |
| **టీఎస్ పీజీసెట్ షెడ్యూల్ ఇలా...** | |
| 12.3.24 | నోటిఫికేషన్ విడుదల |
| 16.3.24 | ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ |
| 10.5.24 | దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ |
| జూన్6 నుంచి 9 వరకు | పీజీ సెట్ పరీక్ష నిర్వహణ |

# ‘స్వగృహ’కు స్వస్తి

(మొదటి పేజీ తరువాయి)

మంచి ధరలకు అమ్ముడుపోయి, కార్పొరేషన్‌కు నిధులు సమకూరి ఉండేవి. వాటితో మిగతా చోట్ల పనులు జరిపితే అవి కూడా అమ్ముడుపోయేవి. కానీ ఆ చొరవ లేక కార్పొరేషనే దివాలా తీసింది. ఏడాదిన్నర క్రితం ఉన్నవి ఉన్నట్టుగా హెచ్‌ఎండీఏ ఆధ్వర్యంలో విక్రయించారు. బండ్లగూడ, పోచారంలలో మూడు వేల ఫ్లాట్ల విక్రయం ద్వారా రూ.700 కోట్లు సమకూరాయి. తొర్రూరు, బహదూర్‌పల్లిలతో పాటు ఆదిలాబాద్, కామారెడ్డి, నిజామాబాద్‌లాంటి కొన్ని జిల్లాల్లో లేఔట్ల రూపంలో ప్లాట్లు, నల్లగొండ లాంటి ప్రాంతాల్లో కొన్ని అసంపూర్తి ఇళ్లు విక్రయించడం ద్వారా మరో రూ.1300 కోట్లు వచ్చాయి. ఇప్పుడు బండ్లగూడ, పోచారంలలో ఇంకా 700 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. బండ్లగూడలో సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు 80, పోచారంలో సింగిల్ బెడ్ రూమ్ ఇళ్లు 300, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 280 వరకు ఉన్నాయి. కొన్ని ట్రిపుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా ఉన్నాయి. వీటిని ఉన్నవి ఉన్నట్టుగా విక్రయించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా పది ప్రాంతాల్లో ఖాళీ స్థలాలున్నాయి. వీటిని గతంలోలాగా లేఔట్లుగా అభివృద్ధి చేసి విక్రయించాలా, గంపగుత్తగా ఎకరాలుగా విక్రయించాలా అన్న విషయాన్ని కమిటీ పరిశీలిస్తోంది. గాజులరామారం, బహదూర్‌పల్లి, జవహర్‌నగర్‌లాంటి ప్రాంతాల్లో భారీ భవన సముదాయాలు అసంపూర్తిగా ఉన్నాయి. వాటిని పూర్తిచేస్తే కొనేందుకు జనం సిద్ధంగా ఉన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఖాళీ స్థలాల్లో కాలనీలు నిర్మించినా డిమాండ్ ఏర్పడే పరిస్థితి ఉంది. ఇటీవల ఇదే విషయాన్ని కొందరు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. అయితే పెట్టుబడి సమకూర్చటమే ప్రభుత్వానికి పెద్ద సవాల్‌గా మారింది. దీంతో ఇళ్లను నిర్మించి విక్రయించాలన్న స్వగృహ కార్పొరేషన్ ప్రాథమిక విధానానికి విరుద్ధంగా ఉన్న భూములను అమ్మి చేతులు దులుపుకోవాలని ప్రభుత్వం దాదాపు ఓ నిర్ణయానికి వచ్చింది. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రారంభించిన రాజీవ్ స్వగృహ కార్పొరేషన్‌కు ఇది మంగళం పాడే నిర్ణయంగానే ఉన్నట్టు కనిపిస్తోంది.

## బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం



**రాజేందర్ నగర్ ఫిబ్రవరి 6( వాయిస్ టుడే):** సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బిఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టిబొమ్మను మణికొండ మున్సిపాలిటీ పరిధిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకోవాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు జితేందర్, కిరణ్ కుమార్,కౌన్సిలర్స్ లక్ష్మీనారాయణ, పురుషోత్తం, పద్మారావు, నాయకులు కస్తూరి సతీష్, అహ్మద్ షా ఖాన్, షేక్ హాజి, రమేష్,మహేష్ రెడ్డి, మాయని శివ, కస్తూరి శ్రావణ, శరత్, బబ్జాని, ప్రవీణ్ కుమార్, ప్రభావతి, మహేందర్ రెడ్డి, శేషు, పవన్, ఆకాష్, ప్రదీప్, భారత్, షానవాజ్ ,శ్రీకాంత్, గణేష్ , నరేందర్ పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులను పరిశీలించిన వైస్ చైర్మన్ కే. నరేందర్ రెడ్డి



**రాజేంద్రనగర్ ఫిబ్రవరి 6(వాయిస్ టుడే):** అభివృద్ధి పనులలో భాగంగా మణికొండ మున్సిపాలిటీ పరిధిలోని మణికొండ క్వార్టర్స్ హనుమాన్ దేవాలయం ముందు సిసి రోడ్డు పనులు చేపట్టారు. ఈ అభివృద్ధి పనులను మణికొండ మున్సిపాలిటీ వైస్ చైర్మన్ కే.నరేందర్ రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సి.బీరప్ప, బి.రవికాంత్ రెడ్డి, ఆలయ చైర్మన్ జె.లక్ష్మయ్య, భాస్కర్ రెడ్డి, వినోద్ సింగ్, మోహన్ తదితరులు ఉన్నారు.

## నార్సింగి సీఐకు ఆహ్వానం




**రాజేంద్రనగర్ ఫిబ్రవరి 6( వాయిస్ టుడే ):** బాల బాలికల బ్యాడ్మింటన్ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరవ్వాలని నార్సింగ్ సీఐ హరికృష్ణ రెడ్డికి మ్యాచ్ పాయింట్ ఫౌండర్, చైర్మన్ వేణు ముప్పల ,కలిసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేషనల్ బ్యాట్మెంటన్ ప్లేయర్, హెడ్ కోచ్ మాట్లాడుతూ. ఆటపాటల వల్ల పిల్లలకు మానసిక ఉల్లాసం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో మ్యాచ్ పాయింట్ మేనేజర్ నాగేంద్ర,కోచ్ లు రాము, శశి,సిద్ధు, గోవింద్,చంద్ర, మంగిలాల్ పాల్గొన్నారు.

## బాల్క సుమన్ సీఎం రేవంత్ రెడ్డి పై అనుచిత వాక్యాలు చేయడం సరికాదు..



**జూబ్లీహిల్స్ ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ నేతలు బోరబండ చౌరస్తాలో, బాల్క సుమన్‌ల దిష్టి బొమ్మ దగ్ధం చేశారు. కాంగ్రెస్ సీనియర్ నాయకులు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ల దిష్టి బొమ్మతో ర్యాలీ నిర్వహించి చౌరస్తాలో దగ్ధం చేశారు. కేసీఆర్,బాల్క సుమన్ లకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బాల్క సుమన్ ను వెంటనే అరెస్ట్ చేయాలంటూ బోరబండ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు ఇచ్చిన కాంగ్రెస్ నాయకులు.. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ లీడర్స్ అశోక్ .నరసింహ. షరీఫ్ మహేష్ కృష్ణవేణి. యాదయ్య ఖాయుం. .సద్దాం. నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# టచ్ చేసి చూడు

(మొదటి పేజీ తరువాయి)

తుంటి ఎముకకు శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న కేసీఆర్.. తొలిసారిగా మంగళవారం పార్టీ కార్యాలయం తెలంగాణ భవన్‌కు వచ్చారు. కేఆర్ఎంబీకి ప్రాజెక్టుల అప్పగింత అంశంపై మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ ఉమ్మడి జిల్లాలకు చెందిన పార్టీ నేతలతో సమీక్ష నిర్వహించారు. కృష్ణా నదిపై ఉన్న ఉమ్మడి సాగునీటి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం కేఆర్ఎంబీకి అప్పగించడం వల్ల రాష్ట్రానికి, ముఖ్యంగా రైతాంగానికి వాటిల్లే నష్టాలు, ఇతర పర్యవసానాలు, బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అనుసరించిన వైఖరి వారికి వివరించారు.

**ప్రాజెక్టుల కట్టల మీదకి కూడా పోలేం:** ‘రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అనాలోచిత వైఖరి.. కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులపై గొడ్డలి పెట్టులా మారింది. నాగార్జునసాగర్, శ్రీశైలం సహా కృష్ణా నదిమీద అన్ని ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పజెప్పి రాష్ట్ర ప్రభుత్వం మన జుట్టును కేంద్రం చేతికి అందించింది. కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగాణ వ్యవసాయ, రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండిస్తున్నా. నేను అధికారంలో ఉన్న పదేళ్లలో కృష్ణా ప్రాజెక్టుల విషయమై కేంద్రం ఎంత ఒత్తిడి తెచ్చినా ఏనాడూ తలొగ్గలేదు. ప్రాజెక్టులు తమకు అప్పగించాలని, లేదంటే తామే నోటిఫై చేస్తామని కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ నన్ను బెదిరించారు. కానీ నేను.. కావాలంటే తెలంగాణలో నా ప్రభుత్వాన్ని రద్దు చేస్తా. రాష్ట్రపతి పాలన పెట్టుకో. తెలంగాణకు అన్యాయం చేస్తానంటే మాత్రం అసలు ఊరుకోను. ప్రాజెక్టులు అప్పగించే ప్రసక్తే లేదని ఆనాడే చెప్పా. కేఆర్ఎంబీ పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణకున్న హక్కులను కైవసం చేసుకునేందుకు కేంద్రం వేస్తున్న ఎత్తుగడలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికప్పుడు తిప్పికొట్టింది., పదేళ్ల పాటు కేంద్రం వత్తిళ్ళను తట్టుకుంటూ ప్రాజెక్టులను కాపాడింది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అవగాహన రాహిత్యంతో కేఆర్ఎంబీకి ప్రాజెక్టులను అప్పగిస్తూ నిర్ణయం తీసుకుని సంతకాలు చేయడం వల్ల భవిష్యత్తులో ప్రాజెక్టుల కట్టల మీదికి కూడా పోలేని పరిస్థితి దాపురించింది..’ అని కేసీఆర్ తెలిపారు.

### తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో పోరాడుదాం

‘రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయం వల్ల హైదరాబాద్ రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్ నగర్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగు, తాగునీరు అందక తిరిగి కరువు కోరల్లో చిక్కుకునే ప్రమాదం పొంచి ఉంది. ప్రజా మద్దతుతో కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర, మూర?పు వైఖరిని తిప్పికొడుతూ, కృష్ణా జలాల్లో రాష్ట్రానికి రావలసిన వాటాలను, ఉన్న హక్కులను నూటికి నూరు శాతం కాపాడేందుకు ఎంతదాకానైనా పోరాడాల్సిందే. నాడు ఉద్యమం నడిపించి తెలంగాణను సాధించి తెలంగాణ హక్కులను కాపాడుకున్న స్ఫూర్తితోనే.. నేడు మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి హక్కులకు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత బీఆర్ఎస్ కార్యకర్తలది. తెలంగాణ ఉద్యమకారులది. తెలంగాణ ఉద్యమం సమయంలోనే సాగు, తాగునీటి హక్కుల కోసం పోరాడాం. ‘మా నీళ్లు మాకే ’ అనే ప్రజా నినాదాన్ని స్వయంపాలన ప్రారంభమైన అనతికాలంలోనే నిజం చేసి చూపించిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిది. రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ప్రజా క్షేత్రంలో ఎండగడదాం..’ అని కేసీఆర్ పిలుపునిచ్చారు.

### ఈ ప్రభుత్వాన్ని మనం కూల్చాల్సిన అవసరం లేదు

ప్రాజెక్టుల విషయంలో మన ఎమ్మెల్యేలు సభలో కొట్లాడతరు. మనం అందరం వెళ్లి నల్లగొండలో కొట్లాడుదాం. మనం ఈ ప్రభుత్వాన్ని కూల్చడానికి గడ్డపారలు పట్టుకుని తిరగాల్సిన అవసరం లేదు. వాళ్లు ప్రకటించిన పథకాలు అమలు చేయలేక వాళ్లకు వాళ్లే కొట్టుకుంటారు. ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడంతో ప్రజల నుంచి తిరుగుబాటు వస్తది. ఏ క్షణంలో ఎన్నికలు వచ్చినా వెయ్యి శాతం మనమే అధికారంలోకి వస్తాం..’ అని కేసీఆర్ వ్యాఖ్యానించారు. సమావేశంలో బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని, మల్లారెడ్డి, పువ్వాడ, సత్యవతి రాథోడ్ తోపాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జెడ్పీ చైర్‌పర్సన్లు, కార్పొరేషన్ల మాజీ మున్సిపల్ చైర్మన్లు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు తదితరులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

**పాలన చేతకాక రేవంత్ కారుకూతలు:** ‘అసెంబ్లీలో మనం తక్కువేంలేం..39 మందిమి ఉన్నాం. ప్రతి అంశాన్ని అక్కడ ఎండగడతాం. ఈ సీఎం ఎక్కువ మాట్లాడుతున్నాడు. సీఎం అనేటోడు ఈరోజు ఉంటాడు. రేపు పోతాడు. తెలంగాణ ప్రయోజనాలు ముఖ్యం. మీరు ఎవరూ గాబరా పడొద్దు. రేవంత్‌వి పిల్ల చేష్టలు. పాలన చేతకాక నా మీద కారు కూతలు కూస్తున్నడట. నల్లగొండలో సభ పెట్టనివ్వరట. మన సభను అడ్డుకునేది ఎవ్వడు? కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఎవ్వడు అడ్డుకోవడానికి. నల్లగొండ ఆయన జాగీరా? ఎట్లా పెట్టుకోనివ్వరో చూద్దాం. ఇలాంటి వాళ్లను చాలామందిని చూసినం.

# 7 నుండి 14 వరకు పారిశుద్ధ్య కార్యక్రమాలు

**ప్రత్యేక అధికారులకు శిక్షణ.**
**ఉపాధి హామీ కూలీలకు 100% పని కల్పించాలి.**
**ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి.**
**కలెక్టర్ శశాంక.**




**రంగారెడ్డి జిల్లా/ఇబ్రహీంపట్నం. ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే):** గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారులకు ఒరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించిన జిల్లా కలెక్టర్ శశాంక.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినందున ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 2వ తేదీ నుండి బాధ్యతలు చేపట్టిన ప్రత్యేక అధికారులు గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషించాలని తెలిపారు. అన్ని గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. ప్రత్యేక అధికారులు 2018 పంచాయతీ రాజ్ యాక్ట్ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన బ్యాంక్ అకౌంటు గురించి, గ్రామంలోని ప్రత్యేక సమస్యలైన త్రాగునీరు, పారిశుద్ధ్యం, కోర్టు కేసుల పైన అవగాహన కలిగి ఉండాలని సూచించారు. రానున్న వేసవి దృష్ట్యా ప్రజలకు త్రాగునీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని తెలిపారు. గ్రామంలోని ప్రతి ఇంటికి నల్లా కనెక్షన్ ద్వారా త్రాగునీరు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని, మారుమూల గ్రామాలకు సైతం శుద్ధ జలం అందించే దిశగా కృషి చేయాలని, లీకేజీ సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించాలని, గ్రామాలలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని అన్నారు. ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా ఉపాధి కూలీలకు వంద శాతం పని దినాలు కల్పించాలన్నారు. గ్రామాలను ప్లాస్టిక్ రహిత గ్రామాలుగా తీర్చిదిద్దేందుకు గ్రామ ప్రత్యేక అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. అందుకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ బాటిళ్ల నియంత్రణకు చర్యలు చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల ప్రత్యేక అధికారుల విధులు-బాధ్యతలు, గ్రామ పంచాయతీ అభివృద్ధికి ప్రణాళిక తయారు చేయడం, తాగునీటి వసతి, పారిశుద్ధ్య నిర్వహణ, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం, హరితహారంలో మొక్కల పెంపకం, రికార్డుల నిర్వహణ, తదితర అంశాలపై వివరించారు. ఈ నెల 7 నుండి 14వ తేదీ వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, ఉదయం 8 గం?ల నుండి ప్రారంభమవుతుందని, ఈ క్రమంలో ప్రత్యేక అధికారులకు వారి పరిధిలోని గ్రామాల సమస్యలపై పూర్తి అవగాహన కలుగుతుందని తెలిపారు. గ్రామాలలో గ్రామసభల నిర్వహణ, విధులు, నిధులు పూర్తి వివరాలు ఉంటాయని, గ్రామాలలో నిర్వహించే కార్యక్రమాలలో స్థానిక ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలని, ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్లు, రాజస్వ మండల అధికారులు, ప్రతి మండలం నుండి ఒక అధికారి ప్రతి రోజు గ్రామ పంచాయతీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ నెల 15వ తేదీన గ్రామ పంచాయతీలలో ప్రత్యేక గ్రామ సభ ఏర్పాటు చేసి గ్రామ పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు మరియు ఇతర పంచాయతీ సిబ్బందికి సన్మానం చేయాలని సూచించారు. ఆయా గ్రామ పంచాయతీలలో సంబంధిత అధికారులు సరైన సమాచారం, అనుమతి లేకుండా విధులకు గైర్హాజరు కాకూడదని, విధులను బాధ్యతాయుతంగా నిర్వహించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ప్రతిమ సింగ్, ఇంచార్జ్ జిల్లా పంచాయతీ అధికారి సంధ్యారాణి, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి దిలీప్ కుమార్, మిషన్ భగీరథ ఎస్.ఈ. ఆంజనేయులు, ఎస్.ఈ. పిఆర్ రాజేశ్వర్, అడిషనల్ పిడి డీఆర్డీఏ నీరజ, ప్రత్యేక అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ సంతకాల సేకరణ

**సమ్మెకు హాజరుకావాలని కార్మికులకు నోటీసులు.. ఫిబ్రవరి 16న దేశవ్యాప్తంగా సమ్మె :మండల కన్వీనర్**



**రాజేందర్ నగర్ ఫిబ్రవరి 6( వాయిస్ టుడే):** ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసిస్తూ గండిపేట్ మండల్ నార్సింగ్ మున్సిపల్ పరిధిలో మంగళవారం మున్సిపల్ కార్మికులు సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కన్వీనర్ దప్పు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ. ఈ నెల 16వ తేదీన దేశవ్యాప్తంగా జరిగే కార్మిక సమ్మెకు కార్మికులు హాజరువ్వాలని నోటీసులు ఇవ్వడం జరిగింది అన్నారు. దీనిలో భాగంగా నార్సింగ్ మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ లేకపోవడంతో ఆఫీసు సిబ్బందికి సమ్మె నోటీసు ఇచ్చినట్లు పేర్కొన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ఉద్యోగ, కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకిస్తూ. కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ విధానం రద్దు చేసి మున్సిపల్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం 26 వేలు చేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం అక్రమంగా తీసుకొచ్చిన లేబర్ కోడ్ 4ను వెంటనే రద్దు చేయాలని,దేశ వ్యాప్త కార్మికుల సమ్మె , గ్రామీణ భారత్ బంద్,మున్సిపల్ కార్మికులు, స్వచ్ఛ ఆటో డ్రైవర్లు కూడా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు. మైపాల్ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి . హైమద్.వంశీ.రాహుల్ పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రిపై అనుచిత వ్యాఖ్యలు బిఆర్ఎస్ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనం...

**కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్**



**హైదర్ నగర్ : ఫిబ్రవరి 6(వాయిస్ టుడే):** రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డి పై బిఆర్ఎస్ మాజీ ఎం ఎల్ ఏ బాల్క సుమన్ చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా శేరిలింగంపల్లి నియోజకవర్గం, కూకట్ పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ లో మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి జగదీశ్వర్ గౌడ్ ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను ఊరేగించి, దహనం చేయడం జరిగింది. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి పై వ్యాఖ్యలు బిఆర్ఎస్ నాయకుల దిగజారుడు తనానికి నిదర్శనం, ఇకముందు ఎవరైనా ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే మా ప్రతి కాంగ్రెస్ కార్యకర్తల చెప్పులు వారి నాయకుల మెడలో పడతాయని హెచ్చరించారు. మీడియాలో వచ్చిన వార్తలను సుమోటోగా తీసుకోని పోలీసులు కేసునమోదు చేయాలనీ అన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టిముక్కల వెంకటేశ్వర రావు, కూన సత్యం గౌడ్, బసంత్ రాజ్, ఎండి ఫయాజ్, డి.గోపాల్, యాదయ్య, ఏకాంత్ గౌడ్, రాజిరెడ్డి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

## బాల్క సుమన్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

**కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి**
**కేపీహెచ్బీ కాలనీలో బాల్క సుమన్ దిష్టిబొమ్మ దగ్ధం..**



**కూకట్పల్లి : ఫిబ్రవరి 6(వాయిస్ టుడే)** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ దిష్టి బొమ్మను కే పి హెచ్ బీ కాలనీ కాంగ్రెస్ పార్టీ నేతలు మంగళవారం దగ్ధం చేశారు. కూకట్ పల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి ఆధ్వర్యంలో కే పి జి కాలనీ టెంపుల్ బస్ స్టాప్ వద్ద బల్కా సుమన్ దిష్టిబొమ్మ దగ్ధం చేశారు. ఈ సందర్భంగా శేరి సతీష్ రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకులు మాట్లాడిన తీరు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసేటట్లుగా ఉందనీ ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ సంస్కార హీనంగా మాట్లాడారని ఒక రాష్ట్ర ముఖ్యమంత్రికి చెప్పు చూపించడం మీ దురహంకారానికి నిలువెత్తు నిదర్శనమని ఎద్దేవా చేశారు. బల్క సుమన్ తన స్థాయిని మరిచి ముఖ్యమంత్రినీ విమర్శించడం తగదన్నారు. అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్కసుమన్ వెంటనే ముఖ్యమంత్రి కి క్షమాపణ చెప్పి, ఆయన మాట్లాడిన మాటలు వెనక్కి తీసుకోవాలనీ డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎలక్షన్ కోఆర్డినేటర్ జుట్టా సునీల్ యాదవ్ జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి సిష్టి ఫణీంద్ర కాలనీ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షులు అరవింద్ రెడ్డి, నాయకులు మల్లి, రాజు, సతీష్, విష్ణు, నితీష్ తదితరులు పాల్గొన్నారు.

# హాఫీజ్ పేట్ డివిజన్‌లోని సప్తగిరి కాలనీలో పలు సమస్యలు, అభివృద్ధి పనులపై కాలనీ వాసులు ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ కి వినతిపత్రం

**లింగంపల్లి : ఫిబ్రవరి 6(వాయిస్ టుడే):** శేరిలింగంపల్లి నియోజకవర్గం హాఫీజ్ పేట్ డివిజన్ పరిధిలోని సప్తగిరి కాలనీ లో నెలకొన్న పలు సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని, ఎమ్మెల్యే గాంధీ అన్నారు. కాలనీ లో అసంపూర్తిగా మిగిలిపోయిన డ్రైనేజీ, రోడ్డు పనులు త్వరలోనే పూర్తి చేస్తామని, సప్తగిరి కాలనీ అభివృద్ధి కి శాయాశక్తుల కృషి చేస్తానని ఎమ్మెల్యే తెలియచేసారు, త్వరలోనే కాలనీ లో పర్యటిస్తామని, నా దృష్టికి తీసుకువచ్చిన ప్రతి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే గాంధీ తెలియచేసారు. అన్ని సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తామని, దశల వారిగా అన్ని పనులు పూర్తి చేసి చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. అదేవిధంగా కాలనీ లలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని , ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తామని ఎమ్మెల్యే గాంధీ చెప్పడం జరిగినది. నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానని ,అన్నివేళలో ప్రజలకు అందుబాటులోకి ఉంటానని ,మెరుగైన ప్రజా జీవనానికి అన్ని రకాల మౌలిక వసతుల కల్పనకు తనవంతు కృషి చేస్తానని ,నియోజకవర్గాన్ని ఆదర్శవంతమైన నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే గాంధీ పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో కాలనీ వాసులు వెంకట్ యాదవ్,



నందు, అర్జున్, శ్రీరాములు, నర్సింలు, శ్రీనివాస్, చెంచు రామయ్య,శ్రీధర్, వెంకటేష్, సురేష్ మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి పనులపై మేయర్ సమీక్ష సమావేశం



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 06):** నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి పనులు పెండింగ్లో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులపై మేయర్ నీలా రెడ్డి అధ్యక్షతన నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణ రావు, అధికారులతో కలిసి మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సదర్భంగా మేయర్ నీలా రెడ్డి మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని, పెండింగ్ లో ఉన్న పలు నిర్మాణ అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్పొరేషన్ పరిధిలో రోడ్లు, డ్రైనేజ్ లు, పార్క్ ల అభివృద్ధి, ట్రాఫిక్ ఇబ్బందులు నియంత్రణ, రోడ్ ప్యాచ్ వర్క్స్ ,విద్యుత్ తీగలకు అడ్డుగా పెరిగిన చెట్ల కొమ్మలు, వాటి తొలగింపు, లేక్ డెవలప్మెంట్, వంటి విషయాలపై ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్, శానిటేషన్, ఎలక్ట్రికల్, హార్టికల్చర్, ఆయా విభాగాల అధికారులతో చర్చించి సమీక్ష నిర్వహించారు.

# ప్రతి జర్నలిస్టులకు అండగా ఉంటా విరంచి హాస్పిటల్ చైర్మన్ మాధవి లత...



**జూబ్లీహిల్స్ ఫిబ్రవరి 6( వాయిస్ టుడే):** యూసుఫ్ గూడా లోని డెమొక్రటిక్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నాలుగవ జాతీయ మహాసభలకు ముఖ్యఅతిథిగా పాల్గొన్న విరంచి హాస్పిటల్ చైర్పర్సన్ మాధవి లత సందర్భంగా ఆమె మాట్లాడుతూ జర్నలిస్టుల సేవలు దేశానికి ఎంతో ఉపయోగమని ప్రభుత్వానికి ప్రజలకు వారధిగా జర్నలిస్టులు పనిచేస్తున్నారని తెలిపారు అన్ని వేళలో ముందుండి పని చేసే జర్నలిస్టులకు విరంచి హాస్పిటల్ తరఫున హెల్త్ కార్డులు ఇచ్చి వాళ్ళను వాళ్ళ కుటుంబాలను ఆదుకుంటామని తెలిపారు.. ప్రతి జర్నలిస్టులు తమ సమస్యలను వివరించారు త్వరలో సీఎం రేవంత్ రెడ్డి ను మరియు డిప్యూటీ సీఎంను జర్నలిస్టులకు డబుల్ బెడ్ రూమ్లో లేదా ఇల్లు స్థలాలు ఇవ్వాలని తెలియజేశారు ..ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తు జర్నలిస్టులు పాల్గొన్నారు.

# భువనగిరి పార్లమెంట్ టికెట్ తనకే?

**కాంగ్రెస్ పార్టీకి విధేయుడుగా పనిచేస్తున్న.**
**బిసిల సంఖ్యాబలం కలిసొస్తుంది.**
**డిప్యూటీ సీఎంకు వినతి. ఇసి శేఖర్ గౌడ్.**



**ఇబ్రహీంపట్నం: ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే)...**భువనగిరి పార్లమెంట్ టికెట్ తనకే ఇవ్వాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను కలిసిన ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈ చంద్ర శేఖర్ గౌడ్ (మామ). భువనగిరి పార్లమెంటు నియోజకవర్గం టికెట్టు తనకు ఇవ్వాలని ఇబ్రహీంపట్నం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఈసి శేఖర్ గౌడ్ (మామ) రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్ బాబు, కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తమ్ కుమార్ రెడ్డి,పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు మధుయాష్కిగౌడ్, ఎమ్మెల్సీ మహేష్ గౌడ్ తదితరులను కలిసి వినతులు సమర్పించారు.

శాసనసభ ఎన్నికల్లో ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే అభ్యర్థిత్వం ఆశించినా కొన్ని అనివార్య కారణాల వల్ల తనకు టికెట్ రాలేదని, ఇప్పుడు భువనగిరి పార్లమెంటు స్థానాన్ని తనకు ఇస్తే ఎంపిగా గెలిచి సోనియా గాంధీకి గిఫ్టుగా ఇస్తానని ఆయన బట్టి విక్రమార్కకు తెలియజేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ సిఎం బట్టి స్పందిస్తూ తాను ఈ విషయంపై రాష్ట్ర స్థాయిలో చర్చించి, జాతీయస్థాయి నాయకులకు తెలియపరచి సీటును కేటాయించేందుకు తన శాయశక్తుల కృషి చేస్తానని శేఖర్ గౌడ్ కు సూచించారు. ఈ సందర్భంగా ఈసి శేఖర్ గౌడ్ మాట్లాడుతూ, తాను ఎన్నో సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీకి సేవలు చేస్తూ పార్టీకి వెన్నంటి ఉంటూ కార్యకర్తలకు, నాయకులకు దిశా నిర్దేశం చేస్తూ వస్తున్నాను.

తన సేవలను గుర్తించి భువనగిరి పార్లమెంట్ ఎంపి టికెట్టు ఇవ్వాలని మంగళవారం తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సిఎం మల్లు బట్టి విక్రమార్కను కలిసి కోరానని ఆయన తెలియజేశారు. భువనగిరి పార్లమెంటు పరిధిలో ఎక్కువ శాతం బిసిలు ఉన్నారని, తాను వారి పట్ల సానుకూలంగా ఉండి వారితో కలివిడిగా ఉన్నానని, తనకు టికెట్ ఇస్తే బిసిలు ఐక్యతగా తనకు ఓట్లు వేసే అవకాశం ఉందని, తనని గెలిపించేందుకు సిద్ధంగా ప్రజలు ఉన్నారని ఆయన తెలిపారు.

# ఇంతటి భారీ విజయం నాలో రెట్టింపు ఉత్సాహాన్ని మరింత బాధ్యతను పెంచింది: ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 6):** అఖండ మెజారిటీతో తనను గెలిపించిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపేందుకు ఎమ్మెల్యే కేపీ.వివేకానంద చేపట్టిన కృతజ్ఞత యాత్ర 21వ రోజైన మంగళవారం 132 డివిజన్ గోదావరి హెూమ్స్, గాయత్రి నగర్, బౌద్ధ నగర్ లలో కొనసాగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ.వివేకానంద మాట్లాడుతూ 85,576 ఓట్ల మెజారిటీ అనేది కేవలం సంఖ్య మాత్రమే కాదని, అది మనము చేసిన అభివృద్ధి, సంక్షేమానికి కొలమానమని..... ఎన్నికలప్పుడు రాజకీయాల కోసం ప్రజల్లో తిరిగే నాయకులకు కాకుండా నిత్యం ప్రజల్లో ఉంటూ మనకు మంచి చేసే నాయకుడికి మా ఓటు అంటూ... మీరు అందించిన ఇంతటి భారీ విజయం నాలో రెట్టింపు ఉత్సాహాన్ని, సంక్షేమం అభివృద్ధి పట్ల బాధ్యతను మరింతగా పెంచాయన్నారు. ఇదే ఉత్సాహంతో రానున్న రోజుల్లో మరింత అభివృద్ధి చేపడతానన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు సంపత్ మాధవ రెడ్డి, కుంట సిద్ధిరాములు, గుమ్మడి మధుసూధన్ రాజు, నరేందర్ రెడ్డి, జ్ఞానేశ్వర్, తోకల నాగేష్ రెడ్డి, ఎల్లా గౌడ్, శ్రీకాంత్, నదీమ్ రాయ్, విజయ్ హరీష్, సమ్మయ్య నేత, మహిళా నాయకురాలు ఇందిరా రెడ్డి, శ్రీదేవి రెడ్డి, అరుణా, శ్యామల, సంతోషి తదితరులు పాల్గొన్నారు.

# బస్ డిపో ఎన్నికల హామీ వరకే పరిమితం కావడం దురదృష్టకరం: ఉమ మహేష్.



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 6):** సీపీఐ ఆధ్వర్యంలో జగద్గిరిగుట్ట చివరి బస్టాప్ వద్ద జగద్గిరిగుట్ట లో బస్ డిపో, మెడికల్ కాలేజ్ ఏర్పాటు చెయ్యాలని కోరుతూ నేడు రిలే నిరాహారదీక్ష లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాఖ కార్యదర్శి సహదేవరెడ్డి, రాజు, ఇమామ్ లకు పూలదండ వేసి నిరాహారదీక్ష ను నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి సీపీఐ రాష్ట్ర నాయకులు ఏసురత్నం, కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రతీ ఎన్నికల సమయంలో అన్ని పార్టీలు తమ మ్యానిఫెస్టోలో హెచ్ఎంటీ స్థలంలో బస్ డిపో, మెడికల్ కాలేజ్ ఏర్పాటు చేస్తామని హామీలు ఇచ్చి గెలిచాక పట్టించుకోకపోవడం అన్యాయమని ఇప్పుడు గతం కంటే జనాభా పెరిగి బస్సుల రద్దీ పెరిగడం తీవ్ర ట్రాఫిక్ సమస్య ఏర్పడితుందని అలాగే పెరిగిన జనాభా ప్రకారం వైద్య సౌకర్యం కల్పించడానికి సూపర్ స్పెషలిటీ హాస్పిటల్ కూడా నిర్మించాలని, నిర్మించే వరకు సీపీఐ తరఫున అనేక పోరాట రూపాలను రూపొందించి ప్రజలకు అవసరాలను చెప్పి ప్రజా ఉద్యమం నిర్మిస్తామని అన్నారు. అదే విదంగా జగద్గిరిగుట్ట లో రహదారులు చిన్నగా ఉండటం వల్ల నిత్యం ట్రాఫిక్ ఇబ్బంది వస్తుందని కావున వెంటనే రోడ్డును విస్తీర్ణత చెయ్యాలని సీపీఐ పోరాటం నిర్వహిస్తే అధికారులు స్పందించినప్పటికి ముందుకు సాగట్లేదని ఈ విషయాన్ని అసెంబ్లీలో సీపీఐ ఎమ్మెల్యే కునంనేని సాంబశివరావు తో ప్రస్తావించేలా చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్ రావ్, మునిసిపల్ అధ్యక్షుడు రాములు, మండల సహాయ కార్యదర్శి దుర్గయ్య, సీపీఐ నాయకులు నగేష్ చారి, ప్రభాకర్, చంద్రయ్య, సామెల్, రవి, యాదగిరి, ఈశ్వర్, నర్సింహ, ఆశయ్య, సుధాకర్, యువజన నాయకులు బాబు, కీర్తి తదితరులు పాల్గొన్నారు.

# హర్యానా గవర్నర్ దత్తాత్రేయని మర్యాదపూర్వకంగా కలిసిన శ్రీశైలం గౌడ్

**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 6):** మాజీ కేంద్రమంత్రి, ప్రస్తుత హర్యానా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయని చండిఘర్ లోని హర్యానా రాజ్ భవన్ లో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ మర్యాద పూర్వకంగా కలిశారు. ప్రస్తుత రాష్ట్ర రాజకీయ అంశాలపై దత్తాత్రేయతో కూన శ్రీశైలం గౌడ్ చర్చించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ ని రాజ్ భవన్ లో దత్తాత్రేయ ఆత్మీయంగా సత్కరించారు.



# అభివృద్ధి పనులను ప్రారంభించిన శంభీపూర్ కృష్ణ



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 6):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుందిగల్ మునిసిపాలిటీ, బహదూర్ పల్లిలోని 10వార్డులో మంగళవారం రూ.40 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్న సి.సి రోడ్డు మరియు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులను వైస్ చైర్మన్ పద్మారావు, స్థానిక కౌన్సిలర్ బొంగునూరి నవనీత శ్రీనివాస్ రెడ్డితో కలిసి కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అభివృద్ధికి ఎల్లవేలలా కృషి చేస్తానన్నారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా పనిచేస్తామన్నారు. అనంతరం కాలనీలో పర్యటించి కాలనీ సభ్యులు మరియు స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు మహేందర్ యాదవ్, సాయి యాదవ్, సీనియర్ నాయకులు సగ్గిడి శ్రీనివాస్, యస్వి సురేందర్ రెడ్డి, ఎక్స్ ఉప సర్పంచ్ రాఘవేందర్ గౌడ్, బీఆర్ఎస్ పార్టీ మునిసిపల్ వైస్ ప్రసిడెంట్ శామీర్ పేట రంగయ్య, మునిసిపల్ యూత్ అధ్యక్షులు శ్రీకాంత్ యాదవ్, నాయకులు పి.వి.రావు, మహిపాల్ రెడ్డి, సంజీవ రెడ్డి, యాదిరెడ్డి, శేఖర్ యాదవ్, వెంకటేష్, రాము, హరీష్, రాజేష్, లడ్డు, మరియు స్థానిక నాయకులు, కాలనీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కూకట్ పల్లి పోలీస్ స్టేషన్‌లో బాల్కసుమన్‌పై యూత్ కాంగ్రెస్ కూకట్ పల్లి ఇన్చార్జ్ జిట్ట సునీల్ యాదవ్ పిర్యాదు

**కూకట్పల్లి : ఫిబ్రవరి 6(వాయిస్ టుడే):** కూకట్ పల్లి నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్వర్యంలో సోమవారం మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన వాఖ్యలు ఖండిస్తూ బాల్క సుమన్ పై మంగళవారం రోజు యూత్ కాంగ్రెస్ కూకట్ పల్లి ఇన్చార్జ్ జిట్ట సునీల్ యాదవ్ అధ్వర్యంలో కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ లో సిఐ కృష్ణ మోహన్ కి పిర్యాదు చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ నాయకులు కలికోట బలరాజ్, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి కూకట్ పల్లి నియోజకవర్గం యూత్ వైస్ ప్రెసిడెంట్ చీటకోరు కృష్ణ, రాహుల్ చూహన్, యన్ఎస్ యుఐ జిల్లా ప్రధాన కార్యదర్శి రామ్ చరణ్ బాలాజీ నగర్ డివిజన్ యూత్



అధ్యక్షుడు శ్రావణ్ కార్యదర్శి రాంచరణ్ యన్ఎస్ యుఐ మరియు యూత్ కాంగ్రెస్ నాయకులు బబ్లూ, సోను కుమార్ ప్రేమ్ కుమార్, రాజు, శివ, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అశోక్ చారీ తదితరులు పాల్గొన్నారు

# కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన పార్లమెంటరీ ఎన్నికల బూత్ స్థాయి సమావేశం



**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 6):** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 131 డివిజన్ లో పార్లమెంటరీ ఎన్నికల బూత్ స్థాయి మీటింగ్ కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశంలో కోలన్ హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజకర్గాని 10 కోట్ల నిధులు కేటాయించిన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృత్జ్ఞతలు తెలియజేసారు, నియోజకవర్గానికి కేటాయించిన 10 కోట్ల నిధులను ఒకొక్క డివిజన్ కి కోటి రూపాయలతో 20% స్కూల్స్, 10% నీటి సమస్యలు మరియు 70% నిధులతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, రోడ్స్, ప్యాచ్ వర్క్, కమ్యూనిటీ హాల్స్ వంటి వాటికి ఉపయోగిస్తామని తెలియజేసారు. నియోజకవర్గం లో తలెత్తిన అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, డివిజన్ కాంగ్రెస్ నాయకులు, మహిళా కాంగ్రెస్ నాయకులు, యువజన కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# విగ్రహ ప్రతిష్టకు సిద్ధమైన ముత్యాలమ్మ దేవాలయంను పర్యవేక్షిస్తున్న జంపన్న ప్రతాప్



**కంటోన్మెంట్, ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే ప్రతినిధి):** న్యూ బోయిన్పల్లి బాపూజీ నగర్ లో ముత్యాలమ్మ ఆలయ పునర్నిర్మాణ పనులు పూర్తి అయ్యాయని ఈ నెల 12 నుండి 14 వ తేదీ వరకు మూడు రోజుల పాటు విగ్రహ ప్రతిష్ఠ అభిషేకాలు. పూజలు. అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తు న్నట్లు ఆలయ ఫౌండర్.కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జంపన ప్రతాప్ తెలిపారు.సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయ ప్రధాన అర్చకులు వేణుమాధవ శర్మ.ఆలయ చైర్మన్ జంపన ప్రతాప్. అధ్యక్షులు దుర్గయ్యలు ఈ రోజు ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లు పరిశీలించారు. మిగిలిన పనులు వేగవంతంగా పూర్తి చేయాలనీ సూచించారు. మూడురోజుల పాటు జరిగే విశేష పూజ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు తీసుకుని ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఆలయానికి ఎవరైనా సహాయం చేయాలనుకునే దాతలు ముందుకు రావాలని తెలిపారు.ఈ సందర్భంగా ఆలయాభివృద్ధికి తమవంతుగా బాపూజీనగర్ పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు 25 వేల చెక్కును అందజేశారు.ఈ కార్యక్ర మంలో శంకర్ లక్ష్మణ్ కుమార్ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి దీపదాస్ మున్షీకి ఘనస్వాగతం పలికిన కొంపల్లి కాంగ్రెస్ పార్టీ నాయకులు




**కుత్బుల్లాపూర్ వాయిస్ టుడే (ఫిబ్రవరి 6):** మైనంపల్లి హన్మంతరావు చేపట్టిన ఛలో సిద్ధిపేట కార్యక్రమానికి విచ్చేస్తున్న తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి దీపదాస్ మున్షీని కొంపల్లిలో ఘనస్వా గతం పలికిన కొంపల్లి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు బైరి ప్రశాంత్ గౌడ్, కొంపల్లి మాజీ సర్పంచ్ జమ్మి దేవేందర్, కౌన్సిలర్ శివకుమార్ గౌడ్, మాజీ ఉపస ర్పంచ్ గోపాల్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ సన్న శ్రీని వాస్ , సురేందర్ రెడ్డి, మాజీ వార్డ్ మెంబర్ కావలి గోపాల్, గోపాల్ రెడ్డి, అశోక్ రెడ్డి, ఉపేందర్ రెడ్డి, అంజి ముదిరాజ్, బైరి శ్రీను, కావలి నవీన్ కాం గ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్దెత్తున పాల్గొన్నారు.

# రేవంత్ రెడ్డి జోలికి వస్తే చూస్తూ ఊరుకోం

## బాల్క సుమన్ నోరు అదుపులో పెట్టుకో: కొరివి అరుణ్ కుమార్



**జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు:** కరీంనగర్ ఫిబ్రవరి 06(వాయిస్ టుడే)ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోలికి వస్తే చూస్తూ ఊరుకోమని కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు కొరివి అరుణ్ కుమార్ హెచ్చరించారు. నిన్న బాల్క సుమన్ రేవంత్ రెడ్డి గారి మీద చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఈరోజు స్థానిక ఇందిరా చౌక్ లో నగర్ ఎస్సి అధ్యక్షులు లింగంపల్లి బాబు ఆధ్వర్యంలో బాల్క సుమన్ దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా కొరివి అరుణ్ కుమార్ మాట్లాడుతూ కల్వకుంట్ల పెంపుడు కుక్క అయిన బాల్క సుమన్ మతిభ్రమించి ఇష్టం వచ్చినట్టుగా మాట్లాడుతున్నారని సుమన్ పద్ధతి మార్చుకోకపోతే ప్రతి చర్యలు తప్పవని ఆయన తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అసభ్య పదజాలంతో దూషించడాన్ని ఆయన తీవ్రంగా తప్పుపట్టారు. ఉస్మానియా విద్యార్థిగా చెప్పుకునే బాల్క సుమన్ చెప్పులు చూపించే సంస్కృతి ఎక్కడ నేర్చుకున్నావని ఆయన ప్రశ్నించారు. 9 సంవత్సరాల బిఆర్ఎస్ పాలనలో దళితులను మోసం చేసినప్పుడు నీ చెప్పులు ఎక్కడ పెట్టుకున్నావ్ అని, అధికారంలోకి వచ్చిన 60 రోజుల్లోనే హామీలను ఒక్కొక్కటిగా అమలుపరుస్తూ ప్రజల మన్నలను పొందుతున్న రేవంత్ రెడ్డి చూస్తే అసూయగా ఉందా అని ఆయన ఎద్దేవా చేశారు వెంటనే బాల్క సుమన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పాలని లేదంటే ఎక్కడికక్కడ అడ్డుకొని అవసరమైతే భౌతిక దాడులకు కూడా సిద్ధపడతామని తెలంగాణలో తిరగనివ్వకుండా చేస్తామని ఆయన ఈ సందర్భంగా హెచ్చరించారు బా బారాస ప్రభుత్వంలో దళితులకు అన్యాయం జరుగుతుంటే నోరు మెదపని బాల్క సుమన్ ఏనాడో దళిత ద్రోహిగా మిగిలిపోయాడని తెలంగాణ ప్రజలు గాని దళితులు గాని బిఆర్ఎస్ నాయకులను నమ్మే పరిస్థితి లేదని కాంగ్రెస్ పార్టీ మీద పూర్తి విశ్వాసం ఉందని ఆయన ఈ సందర్భంగా తెలియజేశారు తదనంతరం బాల్క సుమన్ మీద చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కరీంనగర్ జిల్లా ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో టూ టౌన్ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెన్న రాజ మల్లయ్య లింగంపల్లి బాబు ఏం డి తాజ్, శ్రావణ్ నాయక్ అబ్దుల్ రహమాన్, శ్రీనివాస్ రెడ్డి కలువల రాంచందర్ సయ్యద్ అఖిల్ కుర్ర పోచయ్య బాల బద్రి శంకర్ హస్త పురం రమేష్ జీడీ రమేష్ నాగప్రసాద్ దండి రవీందర్ పోరండ్ల రమేష్ సలీముద్దీన్ దన్న సింగ్ దీకొండ శేఖర్ కుంభాల రాజ్ కుమార్ అజీమ్ బారి అస్థపురం తిరుమల ముల్కల కవిత యోనా జ్యోతి నెల్లి నరేష్ నిహాల్ అహ్మద్ అక్బర్ కీర్తి కుమార్ మాలోతు మహాలక్ష్మి సిరికొండ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# బి.అర్.ఎస్ నేతలు చేసిన భూకబ్జాలకు పాత్రధారి, సూత్రధారి గంగుల కాదా..?

**భూకబ్జా ఆరోపణలు ఎదుర్కొని జైల్లో ఉన్న నిందితులతో గంగుల మూలఖత్ కావడంలో ఆంతర్యమేమిటో..?**

**బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి**



**కరీంనగర్, ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే):** కరీంనగర్ లో భూముల రేట్లు ఆకాశాన్ని అంటడంతో బి.అర్.ఎస్ ప్రభుత్వ అండదండలతో ఆ పార్టీ నాయకులు గత పదేళ్లుగా అధికారం ముసుగులో సామాన్యులకు చెందిన ప్రైవేట్ భూములతో పాటు ప్రభుత్వ భూములను విడిచిపెట్టకుండా విచ్చలవిడిగా కబ్జాలకు పాల్పడ్డారని, ఈ భూ కబ్జాలను కాపాడాల్సిన కొంతమంది రెవిన్యూ అధికారులు, అలాగే పోలీస్ అధికారులు భూకబ్జాదారులకే వంతపాడుతూ కమీషన్లకు కక్కుర్తి పడి, లంచాల మత్తులో మునిగినారని, అలాగే నాటి మంత్రి, నేటి ఎమ్మెల్యేగా భూకబ్జాలను అరికట్టాల్సిన గంగుల కమలాకర్ ఈ భూ మాఫియాకు పాల్పడ్డవారికే వంతపాడుతూ తనే సూత్రదారి, పాత్రదారి పాత్ర పోషించాడని, దీనికి సజీవ సాక్ష్యం భూకబ్జాల ఆరోపణలతో జైల్లో ఉన్న నిందితులతో గంగుల కమలాకర్ మూలఖత్ కావడమే ఇందుకు నిదర్శనమని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి విలేకరుల సమావేశంలో తీవ్రంగా ఆరోపించారు. ఈ సందర్భంగా బేతి మహేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ లో అనేక ఏళ్లుగా చేసిన భూకబ్జాలకు కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మహంతి రూపంలో ఒక మంచి ఆఫీసర్ రావడం, వారు భూఆక్రమణల పై ఎకనామిక్ ఆఫేన్స్ వింగ్ (ఇ.ఓ.డబ్ల్యూ) పేర స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీమ్ (సిట్) ఏర్పాటు చేసి బాధితుల నుండి తనే స్వయంగా ఫిర్యాదులను స్వీకరించి, న్యాయ సలహాలు తీసుకుంటూ, అన్యాయంగా సామాన్యుల నుండి దౌర్జన్యంగా లాక్కున్న భూములను ఇప్పిస్తూ, భూమాఫియాకు పాల్పడ్డ భూకబ్జాదారుల పై కేసులు పెట్టి జైళ్లకు పంపడాన్ని బీజేపీ పార్టీ స్వాగతిస్తూ సి.పి కి కృతజ్ఞతలు తెలియపరుస్తున్నామని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి సి.పి ని ప్రశంశించారు. అలాగే జిల్లా పరిపాలనాధికారైన కలెక్టర్ గారు మౌనం వీడి నిక్కచ్చిగా వ్యవహరించి కరీంనగర్ కార్పొరేషన్ లోని విలీన గ్రామాలైన పద్మనగర్, రేకుర్తి, సీతారాంపూర్, ఆరెపల్లి, తీగలగుట్టపల్లి, వల్లంపాడ్, సదశివపల్లి, నుస్తులాపూర్ లతో పాటు కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ తో పాటు ఇతర గ్రామాలు, అలాగే కొత్తపల్లి మున్సిపాలిటీ, కొత్తపల్లి మండల పరిధిలోని గ్రామాలలోని ప్రభుత్వ, ప్రైవేట్, అసైన్, సిలింగ్ భూములతో పాటు ఎస్.అర్.ఎస్.పి భూములను పరిరక్షించడానికి జిల్లా కలెక్టర్ ముందుకు వచ్చి నీతి, నిజాయితీ గల స్ట్రిక్ట్ ఆఫీసర్లచే సమగ్ర విచారణ జరిపించాలని బీజేపీ పార్టీ డిమాండ్ చేస్తున్నదని బేతి మహేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఇదే కాకుండా ఇప్పటివరకు ఈ భూకబ్జాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి కమీషన్ల రూపంలో లంచాలు తీసుకున్న గతంలో పని చేసిన అర్.డి.ఓ, అలాగే కొంతమంది తహసీల్దార్ లతో పాటు క్రింది స్థాయి రెవిన్యూ అధికారుల పై శాఖ పరమైన కఠిన చర్యలు తీసుకొని కబ్జాలకు గురైన భూములను తిరిగి స్వాధినపరుచుకోవాలని బేతి మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే పోలీస్ స్టేషన్లను అడ్డాలుగా చేసుకొని భూకబ్జాలకు సంపూర్ణంగా సహకరించి పెద్ద ఎత్తున కమిషన్లు తీసుకున్న కొంతమంది పోలీస్ అధికారుల పై కేసులు పెట్టి వారిని సస్పెండ్ తో సరిపెట్టకుండా సర్వీస్ నుండి తొలగించే విధంగా చర్యలు చేపట్టాలని కరీంనగర్ సి.పి గారిని బీజేపీ పార్టీ పక్షాన విజ్ఞప్తి చేస్తూ ఆ దిశగా అడుగులు వేస్తారని ఆశిస్తూన్నాము. అలాగే భూకబ్జాల ఆరోపణలు ఎదుర్కొని జైల్లో ఉన్నప్పుడు నిందితులను కోర్టు పర్మిషన్ తో కస్టడీలోకి తీసుకొని విచారించిన వాంగ్మూలాలను మీడియా సమావేశం పెట్టి కరీంనగర్ ప్రజలకు తెలిసేలా అందులోని పూర్తి వివరాలను బహిర్గతపర్చాలని బేతి మహేందర్ రెడ్డి కోరారు. ప్రజల ఆస్తులను, ప్రభుత్వ ఆస్తులను కాపాడాల్సిన స్థానిక ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆ ఆస్తులకే ఎసరు పెట్టిన వ్యక్తులకు అన్ని విధాలా అండగా నిలవడాన్ని చూస్తుంటే ఇందులో ఎమ్మెల్యే పాత్ర కూడా ఉందన్న అనుమానాలు కలుగుతోందని, అందుకే భూ భాధితులందరు ఏకమై ఎమ్మెల్యే గంగుల కమలాకర్ పై ఉద్యమించాల్సిన సమయం ఆసన్నమైందని, భూ బాధితులందరికి బీజేపీ పార్టీ అండగా ఉంటుందని బీజేపీ రాష్ట్ర నాయకులు బేతి మహేందర్ రెడ్డి భరోసా ఇచ్చారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జిల్లా బి.జె.వై.ఎం ప్రధాన కార్యదర్శి గుడిపాటి జితేందర్ రెడ్డి, దళిత మోర్చా జిల్లా మాజీ కార్యదర్శి జె. డి. భగవాన్, దళిత మోర్చా మాజీ నగర ఉపాధ్యక్షులు వడ్డేపల్లి సుమన్, బీజేపీ సీనియర్ నాయకులు కామరపు నరహరి, ఉప్పులేటి లక్ష్మణ్, పెండ్యాల రామ్ రెడ్డి, మన్నే శ్యామ్ కుమార్ లు పాల్గొన్నారు.

# నిబద్ధత, నిజాయితీతో పనిచేసి గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలి

**ఫిబ్రవరి 7 నుండి15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య డ్రైవ్‌ను పగడ్బందీగా నిర్వహించాలి: జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి**



**కరీంనగర్, ఫిబ్రవరి 06 (వాయిస్ టుడే):** నిబద్ధతతో, నిజాయితీగా తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తూ గ్రామాలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారు లకు సూచించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియం లో నూతనంగా నియామకం చేయబడిన గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారులకు జరిగిన ఒకరోజు శిక్షణ సమావేశానికి, జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అధ్యక్షత వహించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, విధుల్లో ఏమాత్రం ఆలసత్వం, నిర్లిప్తత వహించకుండా, గ్రామాలను సందర్శించి ప్రజలకు అవసం మైన సేవలను అందిస్తూ, గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని సూచించారు. గ్రామపంచాయతీ ప్రణాళికలు, పన్నులు,వసూళ్లు, త్రాగునీటి సరఫరా, అనుమతులు తదితర అంశాలపై జాగ్రత్తగా వ్యవహరించాలని, ఈ నెల 7వ తేది నుండి 15 వరకు ప్రత్యేక పారిశుద్య డ్రైవ్ ను నిర్వహించాలని సూచించారు. జాతీయ ఉపాధి హామి పథకం క్రింద చెపట్టే పనలను వచ్చే మార్చి లోగా పూర్తిచే యాలన్నారు. సెగిరికేషన్ షెడ్లు, విద్యుత్ దీపాల నిర్వహాణ, ఇంటింటి త్రాగునీరు వంటి ప్రదాన కార్యక్రమాలను నిర్వహించాలని తెలిపారు. గ్రామ సభలు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డిఆర్డిఓ శ్రీలత, డిపిఓ వీర బుచ్చయ్య, జిల్లా వైద్యాధికారి లలితా దేవి, డి డబ్ల్యు ఓ సరస్వతి, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ఈ అమరేందర్, ఈఈ రామ్ కుమార్, యూనిసెఫ్ ప్రాజెక్టు సమన్వయకర్త కిషన్ స్వామి, ఎంపీఓ లు ఓ జగన్మోహన్ రెడ్డి,కిరణ్, ఎస్ బి ఎం రమేష్, డీటీఎం సురేందర్ రెడ్డి, డిఎల్పిఓ లత, డిపిఎం ప్రసాదులు పాల్గొన్నారు.

# నిరుపేద వికలాంగుడికి చేయూతనందించిన నా కలం అక్షర సత్యం ఫౌండేషన్

**50 కేజీల బియ్యం, నిత్యవసర వస్తువులు అందచేత..**



**వేములవాడ, ఫిబ్రవరి 06, వాయిస్ టుడే న్యూస్ ప్రతినిధి:** ఆపదలో ఉన్న నిరుపేద వికలాంగుడికి కుటుంబానికి 'నా కలం అక్షర సత్యం' ఫేస్బుక్ సోషల్ మీడియా మంగళవారం చేయూతనందించి మానవతా దృక్పథం చాటుకున్నారు. నిజామాబాద్ జిల్లా భింగల్ మండలకేంద్రానికి చెందిన చెంచు లింబద్రి వికలాంగుడు కాగా లింబద్రికి ఇద్దరు కుమారులు నరేష్, మహేందర్ ఉన్నారు. లింబద్రి నిరుపేద కుటుంబం కావడంతో కనీసం తినడానికి కూడా బియ్యం, నిత్యావసర సరుకులు లేని పరిస్థితి చూసి నా కలం అక్షర సత్యం ఫేసుబుక్ ఫౌండేషన్ వారికి మెప్మా రిసోర్స్ పర్సన్ బద్రి జలజ, అంకం జ్యోతి ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు సమాచారం అందించి సహకారం చెయ్యాలని కోరగా వెంటనే స్పందించిన నా కలం అక్షర సత్యం వ్యవస్థాపక అధ్యక్షుడు లింబద్రి కుటుంబానికి స్థానిక కౌన్సిలర్ సతీష్, మెండోరా యంపీటీసీ ఆరే రవీందర్ చేతుల మిదిగా 50 కేజీల బియ్యం తో పాటు నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఆరే రవీందర్ మాట్లాడుతూ.. లింబద్రి పరిస్థితి తెలపగానే వెంటనే స్పందించిన వ్యవస్థాపక అధ్యక్షుడికి కృతజ్ఞతలు తెలిపారు. నిరుపేద కుటుంబాలకు తమ వంతు ఎప్పుడు సహాయ సహకారాలు అందిస్తామని తెలిపారు. ఇంకా ఎవరైనా ఆపదలో ఉన్న వారిని మా నా కలం అక్షర సత్యం ఫౌండేషన్ ఆదుకుంటామని అన్నారు. లింబద్రి కుటుంబానికి ప్రతి నెల నిత్యావసర వస్తువులు అందిస్తామని హామీ ఇచ్చారు. మెండోరా ఎంపిటిసి ఆరే రవీందర్ తన వంతుగా 25 కేజీల బియ్యం అందించి గొప్ప మనసు చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి అధ్యక్షులు యోగేశ్వర నర్సయ్య, మెప్మా రిసోర్స్ పర్సన్ బద్రి జలజ, బుర్ర శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.





# తెలంగాణ చౌక్‌లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం

**బిఆర్ఎస్ యువజన నాయకుల బైండోవర్**

**వేములవాడ ఫిబ్రవరి 6 (వాయిస్ టుడే):** 14 సంవత్సరాలు తెలంగాణ రాష్ట్ర సాధనలో కొట్లాడిన ఉద్యమకారుడు కెసిఆర్ ను పళ్ళెత్తు మాట అన్న ఊరుకునేది లేదని బిఆర్ఎస్ యువజన నాయకులు వెంగళ శ్రీకాంత్ గౌడ్ అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి కేసీఆర్ పట్ల చేసిన అనుచిత వాక్యలు నిరసిస్తూ మంగళవారం తెలంగాణ చౌక్ లో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దగ్ధం చేశారు. అనంతరం మాట్లాడుతూ తెలంగాణ సాధన ధ్యేయంగా కొట్లాడి సాధించి తొమ్మిదిన్నర సంవత్సరాల్లో రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలిపారని అన్నారు. అనేక సంక్షేమ పథకాలు అమలు చేసి గొప్ప పరిపాలన అందించిన కేసీఆర్ పట్ల సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడిన తీరు ప్రజలు క్షమించరని అన్నారు. మరోసారి ఇలాంటి మాటలు మాట్లాడితే ఊరుకునేది లేదని ఆయన అన్నారు.

# బిజెపి పట్టణాధ్యక్షుడి రాజీనామా



**జగిత్యాల జిల్లా బ్యూరో(ఫిబ్రవరి 6, 2024)వాయిస్ టుడే:** జగిత్యాల బిజెపి పట్టణాధ్యక్షుడి రాజీనామా చేయడం జరిగింది.బీజేపీ పట్టణాధ్యక్షుడు వీరబత్తిని అనిల్ కుమార్ మంగళవారం పార్టీ పదవికి రాజీనామా చేశారు. గత నాలుగు సంవత్సరాల నుండి పదవిలో కొనసాగుతున్న అనిల్ కుమార్ వ్యక్తిగత కారణాల చేత రాజీనామా చేస్తున్న ట్లు ప్రకటించారు. ఈ మేరకు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పైడి పల్లి సత్యనారాయణకు తన రాజీనామా లేఖను అందచేశారు.

# ఈనెల 10 నుండి బండి సంజయ్ యాత్ర...

కరీంనగర్ పార్లమెంటు నియోజకవర్గం పై తిరిగి కాషాయ జెండా ఎగరవేయడమే అంతిమంగా ఈ యాత్ర కొనసాగనుంది. కరీంనగర్ పార్లమెంటు పరిధిలోని అన్ని మండలాలను వీలైనాన్ని,ఎక్కువ గ్రామాల్లో పాదయాత్ర చేసేలా రూట్ మ్యాప్ ను సిద్ధం చేసుకున్నారు. అందులో భాగంగా కొండగట్టు అంజన్న సన్నిధిలో పూజలు నిర్వహించి మేడిపల్లి కేంద్రం నుండి బండి సంజయ్ తన యాత్రను ప్రారంభించను న్నారు. ఈ యాత్ర తొలి విడతలో వేములవాడ,సిరిసిల్ల నియోజకవర్గం చేపట్టనున్నా రు. సిరిసిల్ల జిల్లాలోని తంగళ్ళపల్లి లో తొలి విడత ముగింపు సభను నిర్వహించనున్నారు..

# యంజియంలో కుష్టి వ్యాధి నిర్ములన అవగాహన పక్షోత్సవాలు..



**వరంగల్ 6 పిబ్రవరి వాయిస్ టుడే ప్రతినిధి:** మహాత్మ గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్టు వ్యాధి అవగాహన పక్షోచ్చవాలు వరంగల్ ఎంజీఎం హాస్పిటల్ మంగళవారం నాడు నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మధు బాబు, అఫ్ డెర్మటాలజీ విభాగంలో కుష్టు వ్యాధిగ్రస్తులకు అవగాహన కల్పించి వారికి దుప్పట్లను మరియు వాకెర్స్ ను బహూకరించారు. ఈ సదస్సులో ఇంకా సువార్త, వరంగల్ డీపీఎంవో, అనుపమ, డీపీఎంవొ, మోహన్, మెడికల్ ఆఫీసర్, స్వర్ణలత, ప్రొఫెసర్, వసంత, సుహాసిని, రేణుక, అరవింద, హరిలత, కీర్తి సతీష్ కుమార్ మరియు డెర్మటాలజీ పిజి విద్యార్థులు పాల్గొన్నారు.

# సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ (ప్రజా పంథా) మహాసభలను జయప్రదం చేయండి...

**జిల్లా నాయకులు మైదం పాణి..**



**వరంగల్ 6 పిబ్రవరి వాయిస్ టుడే ప్రతినిధి:** దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణం కోసం పిసిసి సిపిఐ (ఎం.ఎల్), సిపిఐ(ఎం.ఎల్ )ప్రజాపంథా, సిపిఐ (ఎం.ఎల్) రివల్యూషనరి ఇన్సియేటివ్, మూడు విప్లవ కమ్యూనిస్టు పార్టీలు జనవరి 20న హైదరాబాదులో వీలినమయ్యాయి. ఈసందర్భంగా 2024 మార్చి 3,4,5 తేదీల్లో ఖమ్మంలో జరిగే సిపిఐ (ఎం.ఎల్) మాస్ లైన్ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ వరంగల్ జిల్లా నాయకులు మైదం పాణి పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ జిల్లా కేంద్రంలోని ఖిలా వరంగల్ లో మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలతో ప్రచారం నిర్వహించటం జరిగింది. ఈసందర్భంగా మైదం పాణి మాట్లాడుతూ 2024 మార్చ్ 3, 4, 5 తేదీల్లో ఖమ్మం జిల్లా కేంద్రంలో సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ జాతీయ మహాసభ నిర్వహిస్తున్నామన్నారు. దేశంలో బలమైన విప్లవ కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి ఈ మహా సభ ఒక ముందడుగుగా ఉంటుందని తెలిపారు. మార్చి మూడున వేలాది మందితో ఖమ్మం నగరంలో మహా ప్రదర్శన, బహిరంగ సభ, మూడు ,నాలుగు తేదీలలో జరిగే మహాసభకు దేశవ్యాప్తంగా 500 మంది ప్రతినిధులు హాజరవుతారని వారున్నారు. జాతీయ మహాసభ సందర్భంగా జరిగే బహిరంగ సభ, ప్రదర్శనకు వేలాదిగా ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, విప్లవకారులు, అన్ని వర్గాల వారు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎం.ఎల్ మాస్ లైన్ డివిజన్ నాయకులు సాబిరీకానీ మోహన్, కర్ణాకర్, యాదగిరి,గొర్రె పాపయ్య,మసూద్ తదితరులు పాల్గొన్నారు.